

# తమసోమా...

## – తాటిపాముల మృత్యుంజయుడు

(ఫిబ్రవరి సంచిక నుంచి తరువాయి)

('యద్యతాచరతి శ్రేష్ఠః తత్తదే వేతరోజనః సయత్ప్రమాణం కురుతే లోకాస్తదనువర్తతే ' - శ్రేష్ఠుడు చేసే పనిని ప్రామాణికంగా తీసుకొని ఇతరులు ఆచరిస్తారు. భగవద్గీత - కర్మయోగం)

6

డిసెంబర్ నెల, మొదటివారం. ఉదయం పదిగంటలు కావస్తున్నది. రాత్రి కురిసిన మంచు ఇంకా క్యాంపస్‌లోని చెట్లకొమ్మలపై, మైదానాల్లో గడ్డిపై కానవస్తూనే ఉంది. వణికిస్తున్న చలినుండి రక్షించుకుంటూ మూడు పొరల్లో దుస్తులు ధరించారు విద్యార్థులు, అధ్యాపకులు.

ఇంకో ఆరువారాల్లో సెమిస్టర్ ముగియబోతున్నది. చదువులు పూర్తయ్యి గ్రాడ్యుయేషన్ అవబోతున్న విద్యార్థులకు మానసికంగా ఒత్తిడి పెరిగే కాలమిది. గ్రాడ్యుయేట్ కాదల్చుకున్న సీనియర్ విద్యార్థులు తాము ఆశిస్తున్న గ్రేడ్లతో పాసవ్వాలి. నాలుగు సంవత్సరాలుగా ఇంతవరకు పడ్డ కష్టాన్ని ఈ ఆఖరి సెమిస్టర్ తలకిందులు చెయ్యకూడదు. మాస్టర్స్ డిగ్రీ చదివే విద్యార్థుల మానసిక పరిస్థితి అలాగే ఉంది. అంతా సవ్యంగా పూర్తయితే కొందరు ఉద్యోగాలలో జాయిన్ కావొచ్చు. మరికొందరు, తమకు నచ్చిన ఏరియాలో పీ.హెచ్‌డీ. చెయ్యవచ్చు. ఇక పీ.హెచ్‌డీ. పూర్తి చెయ్యదల్చుకున్న విద్యార్థుల సంగతి చెప్పనలవి గాదు. థీసిస్ డిఫెండ్ చేసి పట్టాపుచ్చుకోవటమంటే ఓ యజ్ఞాన్ని పూర్తి చేసినట్టే.

ఇదేవిధమైన ఒత్తిడికి లోనవుతున్నాడు వెంకట్. అతని ఎర్రబడిన కళ్లు నిద్రలేమిని తెలియజేస్తున్నాయి. వణికిస్తున్న చలినుండి తప్పించుకుంటూ ల్యాబ్‌కు వడివడిగా చేరుకున్నాడు. బిల్డింగ్ లోపల హీటింగ్ వున్నది కాబట్టి ఉలెన్ కోటును తీసి హాంగర్ కు తగిలించాడు. తన టేబుల్‌పై ఇరుపక్కలా పేపర్లు పేరుకొని ఉన్నాయి. కంప్యూటర్ సీడీలు చిందరవందరగా పడి ఉన్నాయి. మూడేళ్లుగా తాను పడ్డ కష్టాన్ని మూడొందల పేజీల్లో ఇరికిస్తూ థీసిస్ తయారుచెయ్యాలి. ఇప్పటికీ మూడుసార్లు తిరగేసి రాస్తే దానికి ఓ ఆకారం ఏర్పడింది. ఇంకొద్ది మార్పులు చేసి ప్రొఫెసర్ మిల్టన్ ఓ.కే. చేస్తే డిసెర్టేషన్ కమీటీకి థీసిస్ కాపీలు ఇవ్వచ్చు.

మిగిలి ఉన్న నిన్నటి కాఫీని సింక్‌లో పారబోసి పాట్‌ను కడిగి కాఫీ తయారుచేయసాగాడు వెంకట్. ఒక చేత్తో కాఫీకప్పుతో లోనికొచ్చాడు మిల్టన్. యథావిధిగా కాకీప్యాంటుపై నీలం రంగు షర్ట్ వేసుకున్నాడు.

'హాయ్ వెంకట్! ఈ మధ్య నీ ఈ-మెయిల్స్ చూసుకున్నట్టు లేవు. థీసిస్ రాయటంలో బిజీగా ఉన్నట్టున్నావు' అంటూ అడిగాడు మిల్టన్.

రోజు రాత్రి మూడింటి వరకు పనిచెయ్యటం, తిరిగి ఉదయాన్నే త్వరగా లేచి గబగబా ల్యాబ్ కు వచ్చి థీసిస్ రాయడంలోనే నిమగ్నమవుతున్నాడు. రోజుకి ఐదు గంటలు నిద్రపోతే మహా ఎక్కువ. తన ఈ-మెయిల్స్ చూసుకోక నాలుగైదు రోజులు అవుతుందేమో.

'ఈ మధ్య గూగుల్ వాళ్లు నీకొక ఈ-మెయిల్ పంపించారు. నాకు కూడా కాపీ చేసారు. నీ దగ్గరనుండి జవాబు లేకపోతే నాకు ఇప్పుడే కాల్ చేసారు. కాస్త వీలు చూసుకొని రిప్లై ఇవ్వు' అని చెప్పుతూ అప్పుడే తయారైన వేడివేడి కాఫీని వెంకట్‌కు కప్పులో పోసి చేతికందించాడు. 'థాంక్స్' చెబుతూ కప్పు అందుకున్నాడు వెంకట్. మిగిలిన కాఫీ తను కలుపుకొని 'సీ యూ లేటర్' అంటూ వెళ్లిపోయాడు.

వేడి కాఫీ ఒక గుక్క తాగగానే ఒంటికి పట్టిన చలి వదిలింది. నునివెచ్చని వేడి శరీరంలో ప్రవేశించినట్టయింది. ఇంకో గుక్క తాగుతూ గూగుల్ కంపెనీ నుండి వచ్చిన ఈ-మేయిల్ వెదికి చదవడం మొదలెట్టాడు.

'ప్రియమైన వెంకట్,

నా పేరు పీటర్ డైమండిస్. గూగుల్ అంతరిక్ష విభాగానికి అధిపతిని. నీకు 'గూగుల్ ఎర్త్' సాఫ్ట్‌వేర్ గురించి చాలా సమాచారం తెలిసే ఉంటుంది. అయినా నేను క్లుప్తంగా వివరిస్తాను. మనిషి తన కుర్చీలోనే కూర్చుని ఎలాంటి టెలిస్కోప్ అవసరమే లేకుండా కేవలం కంప్యూటర్ ద్వారా అంతరిక్షంలోని పరిభ్రమించే గ్రహాలను చూడవచ్చు. కొన్ని మిలియన్ల కాంతి సంవత్సరాల దూరంలో వున్న నక్షత్ర సముదాయాల్ని పరిశీలించవచ్చు. రోదసీలో జరిగే విస్ఫోటనాలను తిలకించవచ్చు. గూగుల్ ఇతర స్పేస్ కంపెనీలతో పెట్టుకున్న ఒప్పందాల ద్వారా లభించే సమాచారంతో ఇదంతా సాధ్యమవుతున్నది.

అంతరిక్ష పరిశోధన, రోదసీయానం మొదటినుండి మానవజాతిని ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయి. ఈ రంగాలకు చెందిన సైన్స్, ఇంజనీరింగ్, మరియు గణితశాస్త్రాల్లో పాలుపంచుకోవటానికి నేటి తరానికి ఆసక్తి కలిగించటం గూగుల్ అంతరిక్ష విభాగం ముఖ్యోద్దేశం. యువతను ఉత్తేజపరుస్తూ, వారికి తగిన సహాయసహకారాల్ని అందించాలన్నదే మా సంకల్పం. ఈ ఆలోచనతోనే మేము

'గూగుల్ ల్యూనార్ ఎక్స్ ప్రైజ్' అనే పోటీని ప్రారంభించాము. చంద్రుని మీదకు పంపించగలిగే రోబోను తయారుచేసే టీంకి ముప్పై మిలియన్ డాలర్లు బహుమతిగా ఇవ్వదల్చుకున్నాము. ఈ ప్రస్థానంలో ఇప్పటికే నాసా, మరికొన్ని ప్రైవేటు అంతరిక్ష సంస్థలు గూగుల్‌తో కలిసి పనిచేయటానికి ఒప్పందాలు కుదుర్చుకొన్నాయి.

మరి ఇదంతా సమర్థవంతమైన ఉద్యోగులున్నపుడే సాధ్యమవుతుంది. ఇప్పుడు నాముందున్న అతిముఖ్యమైన పని నా టీంను సమకూర్చుకోవడం. గూగుల్ ఆణిముత్యాల్లాంటి వారిని మాత్రమే ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది అన్న విషయం జగద్విదితం. అంతరిక్ష సలహాదారులను నియమించాలని ప్రపంచవ్యాప్తంగా వెదికి మేము ఎన్నుకొన్న వ్యక్తుల్లో మీరు ఉన్నారు. మీలాంటి యువకులు గూగుల్ అంతరిక్ష ప్రయోగాలకు అమూల్యమైన సలహాలు అందించాలి. అప్పుడే నా విభాగం కలలు సాకారమై లక్ష్యాలను అవలీలగా చేరుకుంటుంది. మా సంస్థలో సలహాదారునిగా చేరటానికి ఇదే నా ఆహ్వానం.

నీకు తెలిసే ఉంటుంది, జీతభత్యాలు ఇవ్వటంలో, స్టాక్ ఆప్షన్స్‌లో గూగుల్ సరిసాటి మరే కంపెనీ రాదు. ఈ ఆహ్వానానికి సానుకూలంగా స్పందిస్తావని ఆశిస్తున్నాను. మిగతా వివరాలు తర్వాత మేయిల్స్‌లో మాట్లాడుకోవచ్చు.

జవాబు కొరకు ఎదురుచూస్తూ - పీటర్'

గూగుల్ ఈ-మేయిల్ చదివిన వెంకట్‌కు సంతోషం కలిగింది. అలాగే, ప్రొఫెసర్ మిల్టన్ పోస్ట్ డాక్టోరల్ రిసెర్చ్ చెయ్యటానికి అవకాశం కూడా ఇస్తానన్నాడు. ముమ్ముందు మరికొన్ని అవకాశాలు, జాబ్ ఆఫర్స్ రావచ్చు. వీటిల్లో ఉత్తమమైన దాన్ని ఎంచుకోవాలి.

కాని... అన్నింటి కంటే తన ముందున్న ముఖ్యమైన పని థీసిస్ డిఫెండ్ చేసి గ్రాడ్యుయేట్ కావడం.

అంతకంటే ముఖ్యమైన విషయం... తను గ్రాడ్యుయేట్ అయ్యేటప్పుడు, పీ.హెచ్‌డీ. పట్టాపుచ్చుకునేటప్పుడు అమ్మానాన్నలు తన సమక్షంలో ఉండడం.

వెంటనే ఇండియాకు ఫోను చేసాడు. పంపించిన పేపర్లన్నీ సవ్యంగా ఉన్నట్టు నాన్న చెప్పాడు. వీసా ఇంటర్వ్యూకి మరో వారం రోజుల్లో హైదరాబాద్ ఎంబసీకి వెళ్తున్నట్టు చెప్పాడు.

అంతా సవ్యంగా జరుగుతున్నందుకు వెంకట్ సంతోషించాడు. తిరిగి తన థీసిస్ పనిలో నిమగ్నమవటానికి టేబుల్ వైపు తిరుగుతుంటే గోడమీద అంటించి ఉన్న వాక్యాల్ని చదివాడు.

**Man's main task in life is to give birth to himself, to become what he potentially is. - Erich Fromm**

జర్మన్-అమెరికన్ మానసిక శాస్త్రవేత్త అన్న  మాటను రోజు చూస్తున్నాడు. కాని, ఎందుకో ఈ రోజు అది కొత్తగా అనిపించింది. మరోమారు పైకి వినిపించేటట్టు చదివాడు.

✡✡✡

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Post your comments